క్లుప్తంగా

గోశాలకు విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెంలోని ఓం శ్రీ కృష్ణ గోశాల వెల్ఫేర్ సొసైటీకి వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, రవి రూ. 15,000 విరాళం అందజేశారు. ఆదివారం గోశాల కార్యాలయంలో నగదు అందించగా దాతలను సత్కరించి, విరాళం స్వీకరించారు. ఈ సమావేశంలో గోశాల కార్యదర్శి, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ గ్రామానికి చెందిన కేన్సర్ బాధితురాలు శ్రావణికి రిటైర్డ్ అధికారి మేడికొండ శౌరి అందించిన యూనిటీ ఆఫ్ మాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుట మధు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు ఆదివారం బాధితురాలి ఇంటికి వెళ్లి ఆరోగ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చిలకబత్తిని కనకయ్య, తెలగమళ్ల గోవింద్, దారా సందీప్ పాల్గొన్నారు.

పాటల సీడీ ఆవిష్కరణ



సీడీ ఆవిష్కరిస్తున్న గాయకులు తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: ప్రజాయుద్ధ నౌక గద్దర్ వర్ధంతి సందర్భంగా పాగి వెంకన్న రచించిన పాటల సీడీని ఆదివారం నగరంలోని అమర వీరుల స్థూపం వద్ద గాయకులు ఆవిష్కరించారు. 'సూపర్ అన్న వ్యాధిలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ అన్న యాదిలో పాగిపాట' అనే పాటల సీడీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చిర్రా రవి, గొంతేటి వీరభద్రం, లింగాల రవికుమార్, ముత్తమాల ప్రసాద్, దేవిరెడ్డి విజయ్, దాసరి శ్రీను, కాల్వకట్ల జాన్, అజయ్ ముత్యం, కుమారి, వెంకట్, రవి, సుధాకర్ రావు, విజయ్, నరసింహారావు, పుల్లారావు, నరేష్, రమణ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం పట్టణ లారీ యజమానుల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నికల అధికారి కొత్త వెంకటేశ్వరరావు ప్రకటించారు. అధ్యక్షుడిగా బోయపాటి కృష్ణకుమారి, రెండో ఉపాధ్యక్షుడిగా బాల్ను శ్రీనివాస్, మొదటి సహాయ కార్యదర్శిగా షేక్ మస్తాన్ వలి, రెండో సహాయ కార్యదర్శిగా మహ్మద్ అలీం, కోశాధికారిగా చంద్ర సీతారాంలతో పాటు కార్యవర్గ సభ్యులుగా ఇస్లావత్ సైదులు, కల్లట్లపల్లి వెంకన్న, గుమ్మడి శ్రీనివాస్, పల్స సైదులు, పోటు వెంకటేష్, భూక్యా కృష్ణ, మహ్మద్ ఇజహార్, ముప్పారపు ఉపేందర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి పదవికి నలుగురు అభ్యర్థులు పోటీ పడగా దగ్గు శ్రీనివాసరావు, మొదటి ఉపాధ్యక్ష పదవిని తేజావత్ వీరన్న విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు అనంతరం లారీ యజమానుల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కింగ్‌డమ్
వినోద	మహావతార్ నర్సింహా
సాయిరాం	సర్ మేడమ్
ఆదిత్య	హరి హర వీరమల్లు
శ్రీనివాస	సయారా(హిందీ),
	కింగ్‌డమ్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	48	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	26	పాలకూర	3
పచ్చిమిర్చి	70		20
కాకర	38	చుక్కకూర	3
బోడ కాకర	180		20
బీర	40	తోటకూర	4
దొండ	40		20
పొట్లకాయ	40	గోంగూర	4
చిక్కుడు	60		20
గోరుచిక్కుడు	48	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		25
చామగడ్డ	36	పుదీన	1
క్యారెట్	46		20
బీట్‌రూట్	36	-ఖమ్మం వ్యవసాయం	

పశువైద్యశాల పంచాయితీ!



వీవీపాలెంలో కూల్చి వేసిన ఆస్పత్రి ఆవరణలోనే వైద్యం అందజేస్తున్న దృశ్యం

ఐదేళ్లుగా పంచాయతీ భవనం నుంచే పశువైద్యం

- నదుపాయాలు లేక తీవ్ర అవస్థలు
- ఆస్పత్రికి శాశ్వత భవనం కల్పించాలని డిమాండ్

రఘునాథపాలెం: డాక్టరున్నా.. వైద్యానికి అవస్థలు తప్పడం లేదు.. ఇది ఎక్కడో మారుమూల గ్రామంలో నెలకొన్న సమస్య కాదు కలెక్టరేట్ సముదాయం ఉన్న రఘునాథపాలెం మండలంలోని వీవీపాలెం గ్రామంలోని పశువుల ఆస్పత్రి దుస్థితి. పశువైద్యశాలకు శాశ్వత భవనం లేకపోవడంతో వందలాది పశువులకు చికిత్స సదుపాయాలు లేక తీవ్ర అవస్థలు ఎదురవుతున్నాయి. గతంలో గ్రామంలోని పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరడంతో దాన్ని ఐదేళ్ల క్రితం కూల్చేశారు. అప్పటి నుండి గ్రామ పంచాయతీ భవనంలో ఉన్న చిన్న గదిలో తాత్కాలికంగా వైద్యం కొనసాగుతోంది.

నిధులున్నా ప్రారంభం కాని పనులు..

ఒకప్పట్లో పాతభవనం కూల్చివేతలోనే భవన నిర్మాణానికి రూ.15 లక్షల నిధులు మంజూరైనప్పటికీ నిర్మాణం ప్రారంభించక ముందే రద్దనట్లు సమాచారం. ఇటీవల మళ్లీ రూ.30 లక్షల నిధులు మంజూరయ్యాయి. అయితే ఇప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి మూగజీవాలకు మెరుగైన వైద్యం అందించేలా శాశ్వత భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలని రైతులు, గొర్రెలు పెంపకందారులు విజ్ఞప్తి చేస్తున్నారు. పశుసంవర్ధక శాఖ దీనిపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఒకే గదిలో వైద్యులు, మందులు.. బయటే చికిత్స

ఈ ఆస్పత్రి పరిధిలో వీవీపాలెంతోపాటు, పక్కనే ఉన్న చెరువు కొమ్ముతండా, వేపకుంట్ల తదితర పంచాయతీల పరిధిలోని వేలాది మూగజీవాలకు వైద్యశాల ఇదే.. ఆయా గ్రామాల నుంచి సుమారు 450 పైగా ఆవులు, 1,600 పైగా గేదెలు, 3,000కు పైగా గొర్రెలు, మేకలున్నాయి. వాటిలో వైద్యం కోసం రోజుకు పదుల సంఖ్యలో వస్తున్నాయి. వర్షాకాలంతో ఈసంఖ్య అత్యధికంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. పాత భవనం కూల్చిన నాటి నుంచి తాత్కాలికమని పక్కనే ఉన్న పంచాయతీ భవనంలోని చిన్నగదిలోనే వైద్యశాల కొనసాగిస్తున్నారు. అదే గదిలో వైద్యులు, మందుల నిల్వచేసి పనిచేయడం, మందుల నిల్వ, పశువులకు బయటే చికిత్స అందించాల్సి రావడం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. వైద్యులు ప్రస్తుతం పంచాయతీ గదిలోనే నివాసం ఉండి, పక్కనే ఉన్న శిథిల ఆస్పత్రి ప్రాంగణంలో వైద్యం చేస్తున్నారు. దీనివల్ల రోగాలు తగ్గడం కంటే వ్యాపించే ప్రమాదం ఉందని పశుపెంపకం దార్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇరుకుగదిలో మందుల నిల్వ..

వైద్యశాలకు భవనం లేక ఇబ్బంది..



గ్రామంలో పశువులకు వైద్యం అందించడానికి డాక్టరు, మందులు ఉన్నప్పటికీ దానికి తగిన విధంగా వైద్యశాల లేకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉంది. తమ పశువులను వైద్యం తీసుకుపోతే శిథిల ఆవరణంలోనే అష్టకష్టాల నడుమ వైద్యం చేయించాల్సి వస్తుంది. అధికారులు, పాలకులు తమ బాధలను గుర్తించి శాశ్వత భవనం నిర్మించాలి

– గంగవరపు బాబురావు, రైతు

భవనానికి నిధులు మంజూరు..



గ్రామంలో పశువు వైద్యశాలకు శాశ్వత భవనం కోసం నిధులు మంజూరయ్యాయి. గతంలో తాను రాక ముందు ఇక్కడ ఉన్న శిథిల భవనం కూల్చివేశారు. అప్పటి నుండి పక్కనే ఉన్న పంచాయతీ భవనంలో మందులు నిల్వ చేసి ఆస్పత్రి ఆవరణంలో వైద్యం అందిస్తున్నాం.

– తుమ్మల క్రిష్ణ, పశువైద్యాధికారి

నేటి నుంచి జోనల్ కార్యాలయాల్లోనూ గ్రీవెన్స్



పాత మున్సిపల్ కార్యాలయంలో సౌత్ జోనల్ కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర ప్రజలకు పరిపాలనను చేరువ చేసేందుకు కేఎంసీతో పాటు జోనల్ కార్యాలయాల్లో పాలనను ప్రారంభించేందుకు అడుగులు పడుతున్నాయి. నగరంలోని సౌత్ (పాత మున్సిపాలిటీ), నార్త్ (బల్లేపల్లి) జోనల్ కార్యాలయాలను ఇప్పటికే ప్రారంభించగా.. పలు కారణాలతో అక్కడ అధికారిక పాలన ప్రారంభించ లేదు. ప్రారంభించిన జోనల్ కార్యాలయాల్లో సోమవారం నుంచి అధికారుల పాలన ప్రారంభించేందుకు నిర్ణయించారు. ఆయా జోనల్ కార్యాలయాల పరిధిలోని డివిజన్ల ప్రజల నుండి వినతులను స్వీకరించాలని వార్డు ఆఫీసర్లకు కేఎంసీ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా డివిజన్ల వార్డు ఆఫీసర్లు జోనల్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం గ్రీవెన్స్‌లో పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. సౌత్ జోనల్ ఆఫీసు పరిధిలో 16, 18, 24, 25, 26, 37, 38, 39, 40, 42 డివిజన్లున్నాయి. నార్త్ జోనల్ ఆఫీసు పరిధిలో 1 నుండి 10 డివిజన్లు ఉండనున్నాయి. ఆయా డివిజన్ల ప్రజలు ఫిర్యాదులు ఆయా కార్యాలయాలకు వెళ్లి అందజేయాల్సి ఉంది.

ఆర్ఓబీ మంజూరుకు కృషి చేస్తా..

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: రామకృష్ణాపురం రైల్వే గేట్ వద్ద ఆర్ఓబీ నిర్మాణానికి కృషి చేస్తానని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హామీ ఇచ్చారు. ఆదివారం ఖమ్మంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో రామకృష్ణాపురం బీఆర్ఎస్ నాయకులు ఎంపీ వద్దిరాజును కలిసి గ్రామస్తులు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను వివరించి, వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన ఎంపీ వద్దిరాజు రైల్వే జీఎంకు ఫోన్ చేసి రామకృష్ణాపురం 107 రైల్వేగేట్ బ్రిడ్జి ఎందుకు మంజూరు కావడం లేదని ఆరాతీశారు. రామకృష్ణాపురం రైల్వేగేటు వద్ద ఆర్‌వోబీ నిర్మించాలని కోరుతూ రైల్వే శాఖ మంత్రికి రిప్రజంటేషన్ అందించేందుకు లేఖను సిద్ధం చేయాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. పార్లమెంటు సమావేశాల్లో రైల్వే మంత్రిని కలిసి బ్రిడ్జి మంజూరు చేసేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కన్నెబోయిన కుటుంబరావు, నాయకులు కురుగుంట్ల రవీందర్‌రెడ్డి, చింతకాని యువజన విభాగం అధ్యక్షులు పిన్నెల్లి శ్రీనివాస్, గుండ్లపల్లి శేషు, శెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కుంభమేళాగా తెలుగు మహాసభలు



సర్టిఫికెట్లను అందజేస్తున్న గజల్ శ్రీనివాస్

ఖమ్మంగాంధీచౌక్: కుంభమేళాను తలపించేలా ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తున్నట్టు మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహక సమావేశం ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆంధ్ర సారస్వత పరిషత్, వికాస వేదికల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ తెలుగు మహాసభలను 2026 జనవరి 3, 4, 5 తేదీల్లో ఏపీలోని గుంటూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభల విజయవంతానికి ఖమ్మంలో సన్నాహక సమావేశం నిర్వహించామన్నారు. నందమూరి తారక రామారావు వేదికగా నిర్వహించే ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.నారాయణ రెడ్డి, దాశరథి, గద్దర్ కుటుంబాలకు పూర్ణకుంభ పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. సాధనాల వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దేశిని విజయ్‌కుమార్ రచించిన మానవత్వం కోసం పుస్తకాన్ని, కాంతేశ్వర రచించిన అంతర్జాల పుస్తకాలను గజల్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కవులు, సాహితీవేత్తలు బి.సత్యనారాయణ, సుభాషిణి, పురుషోత్తం, లెనిన్ శ్రీనివాస్, గోవిందు, శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ బోనాలు



బోనాలు తీసుకెళ్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జూబ్లీపుర సారథినగర్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ముత్యాలమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కన్నం రమేష్ మాట్లాడుతూ... ప్రతీ ఏటా మహిళలందరూ అత్యంత భక్తి శ్రద్ధలతో ముత్యాలమ్మ గుడి సెంటర్ నందు గల దేవాలయానికి మేళతాళాలతో నృత్యాలతో బోనాలు తీసుకొని వెళ్లి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అదేవిధంగా ఈ ఏడాది కూడా ముత్యాలమ్మ బోనాలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గోధుమల శ్రీనివాసరావు, జిల్లా గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కన్నం ప్రసన్నకృష్ణ, నగర అధ్యక్షుడు చేతి కృష్ణ, మాజీ కౌన్సిలర్లు వంగాల వెంకట్, సింగం అంజయ్య, నాయకులు కుమార్, చేతి శ్రీనివాస్, ఐలేష్, అంబటి రఘుబాబు, బలరాంశంకర్, సత్యం, అంబటి నవీన్, ప్రవీణ్, సందీప్, కుమారస్వామి, వీరేంద్ర, పూజారి రాజు, పూస నరసింహారావు, కన్నం నరేందర్, మైస పృథ్వీ, నవీన్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు 'గోపా' అవార్డులు



అవార్డులు అందుకున్న విద్యార్థులు

ఖమ్మం మామిళ్లగూడెం: గౌడ ప్రొఫెషినల్, అఫిషీయల్ (గోపా) ఆధ్వర్యంలో గౌడ విద్యార్థులకు ఉత్తమ అవార్డులు అందజేశారు. 2024–2025 ఏడాదికి పది, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్‌లలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం నగరంలోని బాలాజీ ఎస్టేట్ కార్యాలయంలో అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణలు హాజరవ్వగా నాయుడు సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని ముఖ్యంగా విద్యపై భారీగా నిధులు ఖర్చు చేస్తుందని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం బాలసాని మాట్లాడుతూ.. విద్యను ప్రోత్సహించడానికే గోపా ఏర్పడిందని, ప్రభుత్వం కూడా గౌడ్ కులం పరిస్థితి మేరుగుపడటానికే స్థలం కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతుందన్నారు. రాష్ట్ర గోపా అధ్యక్షుడు బండి సాయన్న గౌడ్ మాట్లాడుతూ.. గోపా స్థాపించి 50 ఏళ్ల సందర్భంగా గోపా స్వర్ణోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తుందని, దీనిలో భాగంగా ప్రతిభ కలిగిన విద్యార్థులకు చేయూతనిస్తున్నామన్నారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లికొండ శ్రీనివాసరావు, గోపా జిల్లా ప్రధాన కార్యదర్శి బొలగాని శ్రీనివాసరావు, కోశాధికారి గండు యాదగిరి, గౌరవాధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రాం ప్రసాద్, డాక్టర్ రణధీర్, డాక్టర్ కట్టా శివాజీ, డాక్టర్ గొపగాని సురేందర్, గుడిద శ్రీనివాస్, కత్తి నెహ్రూ, అమరగాని వేంకటేశ్వర్లు, నరసింహారావు, బిచ్చాల తిరుమలరావు, కట్టెకొల వెంకన్న, ఊడుగు శ్రీనివాస్, బొల్లికొండ దర్గయ్య, బూర రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సేవలను గుర్తించాలి



టీపీటీఎల్ఎఫ్ నూతన కమిటీ

ఖమ్మం సహకారనగర్: ప్రైవేట్ విద్యాసంస్థలలో పనిచేస్తున్న టీచింగ్ ఫ్యాకల్టీ విద్యారంగానికి చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఏ.విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని నిర్మల్ హృదయ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లెక్చరర్స్ పని ఒత్తిడిని తగ్గించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. సంఘం నూతన కమిటీ కన్వీనర్ గుమ్మా ముత్తారావు, కోకన్వీనర్లుగా అనుమోలు రామారావు, మహ్మద్ ఫారూఖ్‌లు ఎన్నికైనట్లు తెలిపారు.

ధర్నాను జయప్రదం చేయండి

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పీసీ) ఆధ్వర్యంలో ఈ నెల 5న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చావా దుర్గాభవాని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని, పలు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.వి.నాగమల్లేశ్వరరావు, షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, బుర్రి వెంకన్న, షమీ పాల్గొన్నారు.

నివాళి..

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడి గ్రామంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు కోటేరు వెంకటరెడ్డి వర్ధంతి సందర్భంగా, పంగిడి పంచాయతీలో మృతిచెందిన కాంగ్రెస్ నాయకుడు ధరావత్ రామచంద్రుకు పలువురు నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ, ఆత్మకమిటీ చైర్మన్లు యరగర్ల హనుమంతరావు, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, పార్టీ మండల అధ్యక్షుడు వాంకడోత్ దీపక్ నాయక్, నరసింహారావు, కిసాన్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు భూక్య శ్యామ్‌లాల్, రమేష్ నాయక్, చిన్న నాయక్ తదితరులు ఉన్నారు.

జర్నలిస్టులకు అండగా సీపీఐ



సురేష్ దంపతులను సన్మానిస్తున్న టీయూడబ్ల్యూజే నాయకులు

ఖమ్మంరూరల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, జర్నలిస్టులు చేసే పోరాటాలకు సీపీఐ అండగా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. ఏదులాపురంలోని తన స్వగృహంలో టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి ఆదివారం సురేష్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు సురేష్ దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు. శెట్టి రజనీకాంత్, కె.మరీష్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుద్దేటి రమేష్‌బాబు, బిక్కి గోపి, సాయి, జీవన్‌రెడ్డి, తిరుపతిరావు, పాశం వెంకటేశ్వర్లు, రామయ్య, వై.జగదీష్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో..

ఖమ్మం మామిళ్లగూడెం: మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో సీపీఐ జిల్లా అధ్యక్షుడు దండి సురేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు పార నాగేశ్వరరావు, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, శీలంశెట్టి వీరభద్రం, ఆకుల గాంధీ, మేకలభిక్షమయ్య, పొన్నం వెంకటేశ్వర్లు, మెంతుల శ్రీశైలం, మాజీ కార్పొరేటర్లు తోట రామారావు, శీలం శెట్టి వీరభద్రం, మాటేటి నాగేశ్వరావు, చామకూరి వెంకటనారాయణలు, తాళ్లూరి హన్మాంతరావు, గీతా వెంకన్న, రిటైర్డ్ డీఎస్పీ కేదాసు నర్సయ్య, పసుపులేటి వెంకటి, మాదూరి పూర్ణచందర్ రావు, ముత్యం ఉప్పల్ రావు, జంగిలి రమణ, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం..



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరం వెలుగుమట్ల అటవీపార్కులో ఆదివారం శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ దక్ష ప్రజాపతి శాలివాహన సొసైటీ వారి ఆత్మీయ సమ్మేళనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా సొసైటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం అర్బన్ తహసీల్దార్ దొడ్డారపు సైదులు, సొసైటీ యొక్క లోగోను, విధివిధానాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు తిగుళ్ల వెంకటరమణ, కార్యదర్శి విలాసాగారపు ప్రసాద్, గౌరవాధ్యక్షుడు కానుగుల రాధాకృష్ణ, ట్రెజరర్ కొలిచలం చిరంజీవి, రాచర్ల రాజు, ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు దరిపల్లి కిరణ్, ఉపాధ్యక్షులు కాంపాటి రమేష్, ప్రధాన కార్యదర్శి మొగలిచెర్ల వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి దరిపల్లి భాస్కర్, సంయుక్త కార్యదర్శి గుమ్మడేల్లి సైదారావు, సమన్వయకర్త సర్వయ్య, గౌరవ సలహాదారులు పోలూరి పరశురాములు, సభ్యులు పోరల్ల కృష్ణ, కానుగుల వేణు, వరికళ్ల లక్ష్మీనారాయణ, అవునూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విడిపోయిన వైద్యసేవలు

- 57 ఏళ్ల తర్వాత పీహెచ్‌సీ తరలింపు
- కలెక్టర్ ఆదేశాలతో ఎస్సీ బాలిక వసతి గృహానికి..
- నేటి నుంచి అన్ని సేవలూ అక్కడే
- సీహెచ్‌సీకి తప్పని సిబ్బంది కొరత



ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



కొత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయనున్న వసతి గృహం భవనం

నేలకొండపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 57 ఏళ్ల తరువాత తరలిపోతుంది... ప్రస్తుతం నేలకొండపల్లి లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్..ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కలిసి ఉండటంతో పీహెచ్‌సీ వేరే ప్రాంతం కు తరలించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఎస్సీ బాలికల వసతివ గృహం భవనంకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం నుంచి అక్కడ నుంచే పీహెచ్‌సీ వైద్య సేవలు అందించనున్నారు.

57 ఏళ్ల క్రితం ప్రారంభం..

నేలకొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 1968 మార్చి 8న సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు ప్రారంభించగా.. అప్పటి నుంచి ఆస్పత్రి విస్తరణ పెరుగుతూ వస్తోంది. 1999, ఏప్రిల్ 19న అప్పటి భారీ మధ్యతర హోమ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దీన్ని 30 పడకల ఆస్పత్రిగా విస్తరణ, పునర్నిర్మాణం చేశారు. 2022లో ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ వైద్య విధాన పరిషత్‌లో చేర్చి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చారు. కాగా, గత పది రోజుల క్రితం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆస్పత్రి సందర్శనలో వైద్య సేవల తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. సీహెచ్‌సీ, పీహెచ్‌సీలు కలిసి ఉండడంతో విధులు పట్ల నిర్లక్ష్య ధోరణి చూపుతున్నారని గ్రహించిన కలెక్టర్ పీహెచ్‌సీని వేరే చోటుకు తరలించాలని తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లును ఆదేశించగా.. చెరువుమాధారం తరలించేందుకు చర్యలు చేపట్టారు. కానీ ఇప్పటికిప్పుడే సాధ్యం కాని నేపథ్యాన మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహం భవనంలోకి తరలించి, అక్కడి నుంచే వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు.

సిబ్బంది సంగతేంటి?

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఐదుగురు వైద్యులు, నలుగురు స్టాఫ్ నర్స్, హెడ్ నర్స్, సిబ్బంది అంతా అక్కడకు వెళ్లాల్సి ఉంది. దీంతో సీహెచ్‌సీలో ప్రస్తుతం నలుగురు వైద్యులు మాత్రమే ఉండగా.. నిరంతర సేవలకు అందించేందుకు కనీసం 9 మంది వైద్యులు ఉండాల్సి ఉంది. పీహెచ్‌సీలో ఎలాంటి ల్యాబ్, ఇతర సౌకర్యాలు లేకుండా వైద్య సేవలు ఎలా అందిస్తారనే చర్చ జరుగుతోంది. వైద్యులు, సిబ్బందిని అంతా పూర్తిస్థాయిలో భర్తీ చేశాకే తరలించాలని సీపీఎం మండల కార్యదర్శి కె.వి.రెడ్డి, తెలంగాణ జనసమితి జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు, సీపీఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, ఆప్ నాయకులు పసుమర్తి శ్రీనివాస్ తదితరులు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులు కలుసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకున్నారు. మరి కొంతమంది వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్ ద్వారా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్‌తో దుకాణాల వద్ద సందడి నెలకొంది.



ఖమ్మం రాపర్తినగర్: పెవిలియన్ గ్రౌండ్‌లో..



నేలకొండపల్లిలో..